

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

# - 25 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

' ఉగ్ర సింహుడా దుల్లాభట్టి
జగజ్జెట్టిరా దుల్లాభట్టి
అపర కల్కిరా దుల్లాభట్టి
కాలసర్పమౌ ఖడ్గము బట్టి
తొడగొట్టి మీసం మెలిబెట్టి
పగబట్టి రిపులను పడగొట్టి
పడతుల మానము గాచిన మేటి
భారతమొక వీరుల వనవాటి.. '

లయబద్ధంగా దాడి పద్ధతిలో వీరకథాగానం సాగుతున్నది. పాటకు అనుగుణంగా వీరరస భావ ప్రకటన చేస్తూ కథను రక్తి కట్టిస్తున్నారు గాయకులు. రంగు రంగుల తలపాగాలు, సిఖ్ఖుసంప్రదాయ దుస్తులను ధరించి చిన్న ఢక్కలవంటి చర్మవాయిద్యాలను లయబద్ధంగా మ్రోగిస్తున్నారు. లయబద్ధంగా చిందు వేస్తున్నారు.

మకరసంక్రాంతికి ముందురోజును భోగి అని తెలుగువారు పండుగ జరుపుకుంటారు. ఆరోజును లోరీ పండుగ గా ఉత్తరభారతంలో విశేషించి సిఖ్ఖులు పెద్ద పండుగగా జరుపుకుంటారు. జానపదుల వీరగాథలు, ఆటపాటలు, మల్లయుద్ధ ప్రదర్శనలు, విందు వినోదాలు జరుగుతాయి. లోరీ పండుగ సందర్భంగా గానం చేయబడే వీరగాథలలో 'పంజాబు పుత్రుడు' దుల్లా భట్టీ గాథ ప్రసిద్ధమైనది.

అక్బరు చక్రవర్తికి చమటలు పట్టించిన పంజాబు సింహం దుల్లా భట్టీ. ఇస్లాంమతాన్ని స్వీకరించిన పంజాబు రాజపుత్ర వంశానికిచెందినవాడు, పంజాబు రాజపుత్రుల పౌరుషానికి ప్రతీక! స్వాభిమానాన్ని అక్బరు పాదాలవద్ద తాకట్టుపెట్టి లొంగి ఉండడానికి నిరాకరించి ఎదురుతిరిగిన వీరుడు. గెరిల్లా యుద్ధ పద్ధతులతో ముచ్చెమటలు పట్టించి, అక్బరు ఢిల్లీ నుండి లాహోరుకు వచ్చేలా చేసినవాడు. ధనమదం ఎక్కినవారిని దోచి, చేజిక్కిన సంపదనంతా బీదసాదలకు పంచిపెట్టినవాడు. యుద్ధంలో తన చేతికి చిక్కిన అక్బరు కుమారుడు జహంగీరును 'నాకు నీ తండ్రి శత్రువు, నువ్వు కాదు'అని, ప్రాణభిక్ష పెట్టి వదిలిన ధీరోదాత్తుడు. అక్బరు సైన్యాధికారుల దుర్మార్గాలనుండి అబలలను రక్షించి వారి మాన ప్రాణాలను కాపాడిన దేవుడు. అక్బరు అంతఃపుర స్త్రీలు తన చేతికి చిక్కితే, వారిని మాతృమూర్తులుగా భావించి సగౌరవంగా సాగనంపిన సాధుచరితుడు.

మోసంతో అతడిని బంధించి, ఉరి తీయించాడు అక్బర్. ఉరికంబానికి వ్రేలాడేముందుకూడా 'పంజాబు వీరపుత్రులు శత్రువులను ప్రాణభిక్ష అర్థించరు' అని నవ్వుతూ మృత్యువును ఆహ్వానించిన మొండివాడు దుల్లా భట్టీ.

'ధూమకేతువై దుల్లాభట్టి
అక్బరు సేనలపై పగబట్టి
కార్చిచ్చుగా చుట్టుముట్టెరా
వందలనొకడే మట్టుబెట్టెరా
అక్బరు అహ మల్లాడ జొచ్చెను
ఢిల్లీ విడి లాహోరుకొచ్చెను
వంచనతో భట్టీని పట్టెను
ఉరికొయ్యకు వేళ్ళాడగట్టెను
భట్టీ మగటిమి గగనము ముట్టెను
పూమాలగ ఉరితాడు పట్టెను
భళి భళి భట్టీ వీరసింహమా!
భళీ భళీ పంజాబు సింహమా!

తారస్థాయికి చేరుకున్నది వీరగానం. వింటున్నవారు శరీరాలను మరిచిపోయారు. మధ్యలో జ్వాలలు చిమ్ముతున్న నెగడు చుట్టూ కూర్చుని ఉన్నారు అందరూ. ప్రత్యేకమైన పీఠం మీద సమర్థుడు ఆసీనుడైనాడు. ఆయనకు వెనుక చేతులు కట్టుకుని ఉద్ధవుడు, కళ్యాణ్ స్వామి పోతపోసిన కంచువిగ్రహాలలా మంటల వెలుగులో మెరిసిపోతున్నారు. వారికి అభిముఖంగా మహలు పనివారు, గ్రామస్తులు చుట్టూ కూర్చుని ఉన్నారు. ఆ వెనుక కూర్చుని వున్నారు ఆ సాయంత్రమే ముక్తివరం చేరుకున్న సమర్థుని శిష్యులు పదిమంది. పంజాబు, హిమాలయప్రాంతం, తూర్పు భారతంనుండి

వచ్చిన మహంతులు వారు. వారికి కొద్దిగా దూరంగా కూర్చుని వున్నారు సమర్థుని శిష్యురాళ్ళు పదిమంది. వారు కూడా వివిధ ప్రాంతాలనుండి ఆ సాయంత్రమే చేరుకున్నారు.

కొద్దిగా ఎడంగా కృష్ణరాయలు తన ఆసనం మీద కూర్చుని ఉన్నాడు. పక్కన కూర్చుని కథలో లీనమైపోయాడు కృష్ణరాయల వంశాంకురం, భవానీప్రసాద రాయలు! అప్పుడే మొలిచిన మావిడి చివురులా లేతగా మెరిసిపోతున్నాడు. మధ్య మధ్య కనులు పెద్దవి చేసి పిడికిళ్ళు గాలిలోకి విసురుతున్నాడు. కోపంతో రోషంతో పళ్ళు బిగించి బుసలు కొడుతున్నాడు. భట్టీ ప్రాణత్యాగం వినగానే ఆ ఎర్రబడ్డ కళ్ళల్లో నీళ్ళు చిమ్ముతున్నాయి.

మంథని అగ్రహారంలో గురుకుల విద్యాభ్యాసం చేస్తున్నాడు ఆ బుడతడు. ఆ ఉదయమే కృష్ణరాయల అంగరక్షకులు వెళ్లి తీసుకువచ్చారు సంక్రాంతి వేడుకలకోసం. వచ్చీ రాగానే రాంబోలా మాలిమి నేస్తం ఐపోయింది. మధ్య మధ్య రాం ప్యారీ కవ్విస్తూ ఎగురుతుంటే, తను కోట ప్రాంగణం, తోట అంతా పరుగులు తీసి అలిసిపోయాడు. ఇంతలోనే ఎవరు చెప్పారో, ఎలా తెలిసిందో, ఉద్ధవుడు, కళ్యాణ్ స్వామి తమ యుద్ధవిద్యలను తనకు చూపించాలని మారాము చేశాడు కొంతసేపు. సాయంత్రం భోగిపండ్ల వేడుకలో పడి మరిచిపోయాడు. ఆ తర్వాత మరలా మారాము మొదలు, ఉద్ధవుడూ కళ్యాణుడు పరస్పరం తలబడితే ఎవరు గెలుస్తారో చూడాలని! యిప్పుడు వీరకథాగానంలో పడి ఆ కోరికను పక్కనబెట్టాడు.

ఈ సమూహానికి దూరంగా నిలువెత్తున ఉన్న దర్బారు హాలు వంటి నడవాలో ఆసీనురాలై ప్రదర్శనను చూస్తున్నది లక్ష్మీబాయి. చుట్టూ చేరి తామూ చూస్తున్నారు ఆమె సేవకురాళ్ళు. వారూ కథలో లీనమై మధ్య మధ్య కోపాన్ని, బాధను, జాలిని సూచిస్తూ ధ్వనులు చేస్తున్నారు. దుల్లాభట్టీ కథ అందరినీ కరిగించింది!

వీరగానం ముగింపు దశకు చేరుకున్నది. శరీరాలు గగురుపొడిచేలా కరుణరసాన్ని ఒలికిస్తూ దుల్లా భట్టీకి నివాళులు అర్పిస్తున్నారు గాయకులు. నెగడు వెలుగులు విరజిమ్ముతున్నాయి. అంతదూరం నుండి గోశాలలోని పశువులు, ఆ ప్రక్కన కట్టి ఉన్న గుఱ్ఱాలు కూడా ఆ గాన మాధుర్యాన్ని గ్రోలుతున్నాయి అన్నట్లు మౌనంగా ఉన్నాయి అంతవరకూ. ఉన్నట్టుండి ఆహనంగా, ఆందోళనగా కదులుతూ ధ్వనులు చేశాయి. వెన్నెల వెలుగులాంటి మంచుపరదాల మాటున ముగ్ధలా మెరిసిపోతున్నది రాయల మహలు. మహలుకు చుట్టూ పది ధనువుల దూరంలో దృఢంగా నిర్మింపబడిన కోట గోడలు మౌనసాక్షుల్లా మౌనంగా అంతెత్తున ఉన్నాయి.

బురుజులమీద పహారా తిరుగుతున్న కావలివాళ్ళు కూడా మధ్య మధ్య చెవులు కథాగానం వైపు వేస్తున్నారు. అటుప్రక్క విశాలమైన వనంలో రకరకాల జాతుల చెట్లు కూడా మౌనంగా ఉన్నాయి మంచులో తడుస్తూ.

గోశాలలో పశువుల కదలికను, గుఱ్ఱాల శాలలో చిరు సకిలింపు ధ్వనులను ఆలకించాయి సమర్థుని చెవులు. వీరగానం ముగింపు దశకు చేరుకున్న సూచకంగా వీరులకు మంగళం పాడుతున్నారు గాయకులు. ఉద్దవా! అని అతనికి మాత్రమే వినిపించేలా పిలిచాడు సమర్థుడు. ఆ పిలుపుకోసమే ఎదురుచూస్తున్నట్లు చురుగ్గా కదిలాడు ఉద్ధవుడు. గ్రామస్తులవద్దకు వెళ్లి లోగొంతుకతో ఏదో చెప్పాడు. వారందరూ లేచి అక్కడినుండే సమర్థుడికి, కృష్ణరాయలకు నమస్కరించి వడివడిగా వెళ్ళిపోయారు. వారిని వెంటవుండి బయటకు పంపి దృఢమైన కోటతలుపులను మూయించాడు ఉద్ధవుడు.

కళ్యాణ్ స్వామి కనుసైగతో సమర్థుని శిష్యురాళ్ళు లేచి అతడిని అనుసరించారు. కళ్యాణ్ స్వామి భవానీ ప్రసాదరాయల చేయిపట్టుకుని వడిగా మెట్లెక్కి లక్ష్మీబాయికి ఏదో విన్నవించాడు. శిష్యురాళ్ళు,సేవకురాళ్ళు వెన్నంటిరాగా మహాలులోకి వెళ్ళిపోయింది లక్ష్మీబాయి. మహలు తలుపులు మూసుకున్నాయి.

అయోధ్యనుండి వచ్చిన రామకృష్ణ స్వామి కళ్యాణ్ స్వామిని అనుసరించాడు మౌనంగా. సింహద్వారం వద్ద వున్న ఆసనంలో భవానీప్రసాదరాయలను కూర్చుండబెట్టి ప్రక్కన గంభీరంగా నిలుచుండిపోయాడు రామకృష్ణస్వామి. ఎక్కడినుండి వచ్చిందో రాంబోలా బాలుడికి రెండవప్రక్కన కూర్చుని యికిలించింది. ఏమీ అర్థం కాక సగం, ముంచుకొస్తున్న నిద్రతో సగం అయోమయంగా చూస్తున్న బాలుడితో నవ్వుతూ చెప్పాడు కళ్యాణ్ స్వామి

'పోరాటం చూస్తాను అన్నావుగా భవానీ! యిక్కడనుండి కదలకుండా చూడు!'అని.

హెచ్చరిస్తున్నట్లుగా రామకృష్ణస్వామి వైపు చూసి మెరుపులా మెట్లను దిగి సమర్థునివైపు కదిలాడు. కొంతసేపటిక్రితం అశ్వశాలలో గోశాలలో ఆ మాలిమి జంతువుల ధ్వనులు వినబడడానికి ముందు నైరుతివైపు బురుజుమీద ఒక సన్నని పొడవాటి ఆకారం ప్రత్యక్షమైంది. పహారా కాస్తున్న సిపాయిని కదలికలు కనిపించనంత వేగంగా సమీపించింది. కనులు మూసి తెరిచేలోపు ఆ సిపాయీ దేహాన్ని తడిమినట్లుగా అనిపించింది. సిపాయీ బురుజుమీద ఒరిగిపోయాడు. మెరుపువేగంతో ఆ సన్నని ఆకారం కదిలింది. వాయవ్య, ఈశాన్య, ఆగ్నేయ దిశలలో ఉన్న బురుజులమీది సిపాయీలు కూడా వాలిపోయారు. నీడలలా నాలుగువైపు గోడలమీద ఐదేసి ఆకారాలు ఆయుధాలు ధరించి ప్రత్యక్షం అయ్యాయి. సన్నని ఆకారం దూదిపింజలా గాలిలో తేలుతున్నట్లు కోటబురుజులమీదినుండి నేలమీదకు వాలింది. మిగిలిన ఆయుధధారులు బురుజుల మెట్లవెంట నీడల్లా దిగి ముందుకు కదిలారు. ఆ సన్నని ఆకారం సరాసరి కృష్ణరాయలు ప్రభుతులు ఉన్నవైపు విలాసంగా నాట్యం చేస్తున్నట్లు నడిచింది. ఆయుధాలను ధరించిన ఆకారాలు నాలుగుప్రక్కలకూ విడిపోయి ఆయుధాలను ఎత్తిపట్టుకుని ముందుకు కదిలాయి.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS